క్లుప్తంగా

రామచంద్రాపురంలో రాయల్ ఓక్ స్టోర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫర్నిచర్ బ్రాండ్ రాయల్ ఓక్ తన నూతన 148వ స్టోర్‌ను శనివారం రామచంద్రాపురం పట్టణంలో ప్రారంభించింది. సినీహీరో నిఖిల్ సిద్ధార్థ చేతుల మీదగా ఈ స్టోర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాయల్ ఓక్ చైర్మన్ విజయ్ సుబ్రహ్మణ్యం, మేనేజింగ్ డైరెక్టర్ మదన్ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ మహేశ్వరి విజయ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీ చౌరస్తాలో రామచంద్రాపురం మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న చింత ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ : రంజాన్ పండుగ సందర్భంగా ఇమామ్‌లు, మౌజమ్‌లకు శనివారం 500 మందికి రూ.2800 విలువ చేసే నిత్యావసర సరుకులను రాష్ట్ర హ్యాండ్లూమ్ చైర్మన్ చింత ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అఫ్జల్, అమిత్, మసూద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానంలో కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు జలగరి ఎట్టయ్య, జయశ్రీ, యాదయ్య పాల్గొన్నారు.

వేంకటాచల దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోని వేంకటాచల దివ్యక్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేసి మొక్కులను చెల్లించుకున్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలం పాట



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

హత్నూర,(సంగారెడ్డి): మండల పరిధిలోని షేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులోని పలుగు పోచమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు విక్రయానికి శనివారం వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో శెట్టిపల్లి వెంకటేశంగౌడ్ రూ.9.51లక్షలు అత్యధికంగా పాట పాడి వేలం హక్కులు దక్కించుకున్నారు. ఏడాది కాలం పాటు టెండర్‌దారుడికి వేలం హక్కులు ఉంటాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు శివరాజ్, రంగారావు, శశిధర్, ఆలయ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, ధర్మకర్తలు, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఆలయ అర్చకులు శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘స్వచ్ఛ సర్వేక్షణ్’

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



రామచంద్రాపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్–ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్‌కాలనీవాసులతో కలిసి ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతికాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న సమున్నత లక్ష్యంతో ప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులు రోజు ఉదయం రెండు కాలనీలలో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి నిధులు అవసరమైతే అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారన్నారు. 14 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులు నిబద్ధతతో పని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీవాసులతో ముఖాముఖి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్‌జీఎంసీ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కారించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ చేపట్టినట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీ, భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీవాసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధుఆదర్శ్ రెడ్డి,ఉపకమిషనర్‌బాలయ్య పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమ పనులు నిలిపివేయాలి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): రైతులకు ఇబ్బంది కలిగించే కాలుష్య కారక పరిశ్రమ పనులను వెంటనే నిలిపివేయాలని వడ్డేపల్లి గ్రామస్తులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని వడ్డేపల్లి శివారులో పరిశ్రమ ఎదుట ఆయా గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ఆందోళనలు శనివారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వడ్డేపల్లి శివారులో సురభి లాబరేటరీ పరిశ్రమ నిర్మాణం పనులను నిలిపివేయాలని తొమ్మిది రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. రెండు రోజుల క్రితం ఆర్డీఓ బృందం పరిశ్రమ పనులను పరిశీలించినా నేటికీ నివేదికను అందజేయలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశ్రమ పనులను నిలిపివేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: వాసవి క్లబ్స్ సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో శనివారం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని స్థానిక ఐబీ సమీపంలోని అపార్టుమెంట్ వద్ద పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనిత క్లబ్ సంగారెడ్డి అధ్యక్షురాలు మిరియాల సరిత మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షుడు చందా శ్రీధర్, అడిషనల్ ట్రెజరర్ పుల్లూరి ప్రకాష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఇరుకుళ్ల ప్రదీప్‌కుమార్, రీజియన్ చైర్మన్ నామ శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షులు పుట్నాల లక్ష్మణ్, వనిత, కార్యదర్శి నామ పద్మ, వనిత కోశాధికారి ఉప్పల స్వప్న, వనిత మాజీ అధ్యక్షురాలు ఇళ్లింతల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

విద్యావ్యవస్థపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న సయ్యద్ సాబేర్

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్

కొండాపూర్(సంగారెడ్డి): విద్యావ్యవస్థపై, ఉపాధ్యాయులపై చిన్నచూపు చూడటం ప్రభుత్వానికి తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్ అన్నారు. శనివారం సంగారెడ్డిలోని ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాబేర్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆశలను అడియాశలు చేస్తూ, మనోధైర్యం కోల్పోయేలా చేస్తోందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టుల్లో ఉన్న చిక్కులను తొలగించేవిధంగా అడ్వకేట్ జనరల్ సహాయంతో కేసులను వేకేట్ చేపించి బదిలీలు, పదోన్నతులు చేపట్టి విద్యావ్యవస్థను కాపాడాలని కోరారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ వచ్చే జూలైతో పీఆర్సీ గడువు ముగియనందునా కొత్త పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి గడువు లోపల రిపోర్ట్ తెప్పించుకొని పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్‌శర్మ, రాష్ట్ర కార్యదర్శి జీవన్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, జిన్నారం మండల అధ్యక్షుడు గోపాల్ సంగారెడ్డి మండల అధ్యక్షుడు నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ‘తిరగబడర స్వామి’ సినిమా షూటింగ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రెండు రోజులుగా పట్టణంలోని పస్తాపూర్ మహీంద్ర కాలనీలో ‘తిరగబడరా స్వామి’ సినిమా షూటింగ్ చేస్తున్నారు. జహీరాబాద్‌కు చెందిన సినీనిర్మాత, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ మల్కపురం శివకుమార్ సురక్ష ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జహీరాబాద్‌లో నెల రోజుల పాటు మొదటి షెడ్యూల్ షూటింగ్ చేపట్టారు. రెండో షెడ్యూల్‌ను శనివారం మహీంద్ర కాలనీలోని బస్టాప్‌లో హీరో రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వీలపై పలు సీన్లను చిత్రీకరించారు. విలన్‌గా మకరంద్ దేశ్ పాండే నటిస్తున్నారు. వీరితో పాటు నటినటులు బిత్తిరి సత్తి, ప్రగతి, గీతాసింగ్, రాజారవీంద్ర, తాగుబోతు రమేష్, రఘుబాబు పృథ్వీలు నటిస్తున్నారు. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహిస్తుండగా, జీవన్‌బాబు సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ చూసేందుకు అధికసంఖ్యలో ప్రజలు తరలిరావడంతో మహీంద్ర కాలనీలో సందడి నెలకొంది.



హీరో, హీరోయిన్‌లపై సన్నివేశం చిత్రీకరణ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

మునిపల్లి(అందోల్): గ్రామాల అభివృద్దే లక్ష్యమని ఎంపీపీ శైలజాశివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయి కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దగోపులారం సర్పంచ్ కీర్తికుమారి ఆధ్వర్యంలో రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సహకారంతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంత పురుషులకు బైక్ మెకానిక్‌లో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 2, 2023 నుంచి మే 31 వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనవసతితో పాటుగా ఉచితంగా యూనిఫామ్ అందజేసి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు టూల్ కిట్‌ను ఉచితంగా అందజేస్తామన్నారు. 18 నుంచి 45 వయసు ఉన్న వారు అర్హులన్నారు. పూర్తి సర్టిఫికెట్లతో ఈ నెల 29లోపు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9490103390, 9490129839 సంప్రదించవచ్చన్నారు.

మోటారు సైకిళ్ల యజమానులు సంప్రదించండి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో నిబంధనల ఉల్లంఘన, ఇతరత్రా కారణాలతో స్వాధీనం చేసుకున్న 48 ద్విచక్రవాహనాలు ఉన్నాయని ఎస్ఐ వెంకట్‌రెడ్డి శనివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. వాహనాల మోడల్, నెంబర్లను విడుదల చేస్తూ వాహనాలకు సంబంధించిన యజమానులు తమతమ వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, గుర్తింపు ధృవీకరణపత్రాలను తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పెరిగిన పోస్టాఫీసు వడ్డీ రేట్లు

సంగారెడ్డి టౌన్: తపాలశాఖ అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లు పెరిగాయని సంగారెడ్డి డివిజన్ సూపరింటెండెంట్ ఎస్‌వీఎల్‌ఎన్ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికం ఏప్రిల్ నుంచి జూన్ వరకు భారీగా పెంచడమే కాకుండా మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పెరిగిన వడ్డీరేట్లు కొత్త పథకాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల పరిధిలోని శేఖాపూర్‌తండాలో గిరిజన మహిళా రైతులకు భూసార పరీక్షలపై కేవీకే, డీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త స్వామి మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించకుండా ఎరువులు వాడడంతో భూమిలో బలం తగ్గుతుందన్నారు. మట్టి పరీక్షలు చేసుకుంటే అవసరం ఉన్న ఎరువులను మాత్రమే వాడవచ్చన్నారు. దీంతో పంట దిగుబడితో పాటు భూసారం పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం భూసార పరీక్షలు చేసుకునే సమయమని, రైతులందరూ మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఎస్ సూపర్‌వైజర్ సుక్కమ్మ మహిళా రైతులు పాల్గొన్నారు.

పీఎంఆర్ కానుక అందజేత



కానుకను అందజేస్తున్న సర్పంచ్

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని మెదపల్లి సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ‘పాపకు ప్రేమతో’ పేరిట పీఎంఆర్ కానుకను కొంతకాలం నుంచి అందిస్తూ వస్తున్నారు. శనివారం ఝరాసంగం ప్రభుత్వ ఆసుపత్రిలో మెదపల్లి గ్రామానికి చెందిన బోయిని రాణమ్మకు ఆడబిడ్డ పుట్టడంతో సర్పంచ్ ఆసుపత్రికి చేరుకొని పీఎంఆర్ కానుకలో భాగంగా రూ.1,111, స్వీట్‌బాక్స్ అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుదర్శన్, గ్రామస్తులు గఫార్, కిష్టయ్య, రేవన్, ఇక్బాల్ పాల్గొన్నారు.

గ్రంథాలయ స్లాబ్ పనులు ప్రారంభం



నారాయణఖేడ్: పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలో రూ.50లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ పక్కాభవన నిర్మాణంలో భాగంగా శనివారం స్లాబ్ పనులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్‌లో గ్రంథాలయానికి పక్కాభవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న పాఠకులకు పక్కాభవనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ విజయ్, బుజ్జి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దిలీప్, నాయకులు వెంకట్‌రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లికి చెందిన వెంకటి నాగయ్యకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.34వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. పెద్దశంకరంపేట మండలం వీరోజీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పల్లెబోయిన రాములు విద్యుదాఘాతంతో మృతి చెందగా బీమా ద్వారా అతడి భార్య శోభకు రూ.2లక్షలు మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కును క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి



కార్యక్రమానికి హాజరైన వైద్యులు

టీఎస్‌సీఎస్ వైస్ ప్రెసిడెంట్ రత్నవల్లి

సంగారెడ్డి టౌన్ : తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) వైస్ ప్రెసిడెంట్ రత్నవల్లి అన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని ఎంఎన్‌ఆర్ హోమియోపతి మెడికల్ కళాశాల హాస్పిటల్‌లో టీఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఎంఎన్‌ఆర్ యూనివర్సిటీ క్యాంపస్‌లో రక్తదానంపై అవగాహన శిబిరం నిర్వహించారు. శిబిరానికి 400 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం రత్నవల్లి మాట్లాడుతూ దాతల నుంచి రక్తాన్ని సేకరించి తలసేమియా రోగులకు ఉచితంగా అందిస్తామన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. తలసేమియా బాధిత పిల్లలందరికీ సహాయం చేయాలనే లక్ష్యంతో రక్తమార్పిడి కేంద్రం, బ్లడ్ బ్యాంక్, ఆధునిక డయాగ్నస్టిక్ లాబొరేటరీతో పాటు 3500 కంటే ఎక్కువ నమోదిత రోగులకు అధునాతన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఆర్ గ్రూప్ ఆఫ్ కాలేజీ వైస్ చైర్మన్ రవివర్మ, ఎంఎన్‌ఆర్ కాలేజ్ ఆఫ్ హోమియోపతి డైరెక్టర్ డాక్టర్ మణిలాల్, ఎంఎన్‌ఆర్ కాలేజ్ ఆఫ్ హోమియోపతి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత



హత్నూర: ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్యదర్శులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం హత్నూర ఎంపీడీఓ శారదాదేవికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ ప్రొబేషన్ కాలపరిమితి ముగిసినప్పటికీ రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ పిలుపుమేరకు సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17నుంచి నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్లు వీఏఓలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఝరాసంగం ఐకేపీ కార్యాలయంలో అకౌంటెంట్ సుధాకర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26వేలు, రూ.10లక్షల సాధారణ బీమా కల్పించాలన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్ సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తిగత ఖాతాల్లోకి చెల్లించాలని తెలిపారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.



ఝరాసంగం: వినతిపత్రం అందజేస్తున్న ఐకేపీ వీఓఏ ఉద్యోగులు

నేడు పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్

కొండాపూర్ (సంగారెడ్డి): తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఈయూ) రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నేడు సంగారెడ్డిలో పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1, 2004 తరువాత నియామకమైన ఉద్యోగులకు ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం అమలు చేస్తుందని, ఇది పూర్తిగా మార్కెట్‌పై ఆధరపడడంతో మార్కెట్ ఒడిదొడుకులకు లోనై ఎంత పెన్షన్ వస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. కార్పొరేట్‌లకు లాభం చేకూరేలా ఉన్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలవుతున్న నూతన పెన్షన్ విధానం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీయూఈడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నేడు సంగారెడ్డి పట్టణంలో పెన్షన్ రాజ్యాంగ మార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అధికసంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

టీఎస్‌సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ర్యాలీ..

సదాశివపేట(సంగారెడ్డి): నూతన పెన్షన్ విధానం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పెన్షన్ రాజ్యాంగ మార్చ్(ర్యాలీ) నిర్వహించనున్నట్లు టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని ఐబీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షన్ రాజ్యాంగ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

కోహీర్(జహీరాబాద్): ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహనను తప్పనిసరిగా పెంచుకోవాలని ఎస్ఐ సురేష్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో జీవితంలో అనేక అనార్థాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. గ్రామంలో గొడవలు చోటుచేసుకున్నప్పుడు గ్రామపెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా పోలీసుశాఖ కళాకారులు పాటల రూపంలో రోడ్డు ప్రమాదాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, అంటరానితనం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.